
# సాఫ్ట్‌వేర్ పెళ్ళాం

దుర్గమహంతి మోహనరావు

“ఏయ్ మదన్! టెన్నిస్ గేమ్ చూస్తున్నావా? నీకు స్పోర్ట్స్ ఇష్టముండదు కదురా” కొత్తగా మూణ్ణెల్ల క్రితం పెళ్ళైన మొగుణ్ణి ఉద్దేశించి అంది శృతి.

“ఈ రోజు నీ బర్త్‌డే కదా అని ఆఫీస్ ‘బంక్’ కొట్టి మెగాహోప్స్‌తో వచ్చాను. నీకేమో మూడ్‌లేనట్లుంది, బోర్ కొడుతుంటే స్పోర్ట్స్ ఛానల్ ఆన్ చేశాను. అయినా టెన్నిస్ చాలా ఇంట్రెస్టింగ్ యార్! ఆ పాప చూడు ఆమె జడ చూడు ఎంత ముద్దుగా ఉందో, బొద్దుగా ఆ ముద్దుగుమ్మ గ్రౌండంతా తిరుగుతూ ఆడుతుంటే వెరీ ఇంట్రెస్టింగ్‌గా వుందిరా” టివి మీద నుండి దృష్టి మరల్చకుండా జవాబిచ్చాడు మదన్.



''నువ్వేం చూస్తున్నావో నాకు బాగా తెల్సురా! నా పెదవి చూడు ఎలా ఉబ్బిందో, ఏదో చీమ కుట్టినట్టుంది'' పెదవులను చూపి అతని చేతిలో రిమోట్ ఆఫ్‌చేసి ప్రక్కనే కూర్చుంది ఆమె.

''అబ్బ! చీమకెంత అదృష్టమోరా!! నీ బాడీ అంతా 'డౌన్‌లోడ్' చేసుకోవచ్చు, ఎక్కడంటే అక్కడ, ఎప్పుడంటే అప్పుడు కుట్టుకోవచ్చు. నాకు లేదు ఆ అదృష్టం. దానికి మందు 'చుంబన లేహ్యమే'' అంటూ ఆమెను మరింత దగ్గరగా తీసుకుని చుంబించాడు. ''ధర్మము, అర్ధము, కామము, మోక్షము అనే నాలుగు పురుషార్థాల్లాగా ముద్దులు కూడా నాలుగు రకాలు, సమచుంబనము, వక్ర చుంబనము, ఉద్భ్రాంత చుంబనము, అవపీడిత చుంబనం.భర్తృహరి 'ముద్దు'కు విరోధి. ముద్దువలన ఏ ప్రయోజనం లేదు అంటాడు. నువ్వు చెప్పరా అసలు ప్రయోజనం ఉందా? లేదా?'' ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు. ''చాల్లేరా ఈ ముద్దుల క్లాసు మూణ్ణెల్ల నుండి పీక్కుతింటున్నావు. సిగ్గు వదిలేసిన నా బాడీ దీనికి ఎడిక్ట్ అయిపోయింది'' ఇంకా ఆ అనుభూతి కావాలని ఇష్టమున్నా విడిపించుకునే ప్రయత్నిస్తూ అంది శృతి. ''నాకు స్విస్ బ్యాంకులో ఎకౌంట్ లేదుకాని ఈ కిస్ బ్యాంకులో ఎకౌంటుంది. కావలసినప్పుడల్లా ఎ.టి.కె. ఉపయోగిస్తాను''

''ఎ.టి.ఎమ్. లా ఎ.టి.కె. ఏంటీ'' చిలిపి కళ్ళు ఎగరేస్తూ అంది ఆమె.

''ఎనీ టైమ్ కిస్'' ఆమె జున్నుముక్కలాంటి కటివలయాన్ని గట్టిగా నొక్కాడు.

''మదన్ నువ్వు మదనుడవే కాదనను కాని ఇలా పట్టపగలు నొక్కితే ఎలా?''

''పట్టపగలు హత్యలు జరుగుతుంటే లేదుకాని కట్టుకున్న పెళ్ళాన్ని ముట్టుకుంటే తప్పా'' సుతారంగా ఆమె చెయ్యినొక్కి మూతి ముడిచాడు.

''నే ఫ్రెష్‌గా స్నానం చేసివస్తాను. గుడికి పోదాం. అబ్బ! వదలరా!!''

''ఆన్ లైన్ హెల్ప్ చెయ్యనా''

''ఏం అక్కర్లేదురా''

''ఇలా నన్ను అరేయి, తురేయి అంటేనే బామ్మ మనల్ని ఇంట్లోంచివెళ్ళగొట్టింది. చివరికి అద్దె కొంపలో లోన్లీగా ఉండవలసి వచ్చింది'' మదన్ మురిపిస్తూ అన్నాడు.

''లోన్లీగా ఉన్నందుకే నువ్వు ఆగడాల పిల్లోడై పోతున్నావు. ఎప్పుడంటే అప్పుడు నీ ఆటలు సాగుతున్నాయి'' గోముగా మందలించి బుంగ మూతితో వెక్కిరించి విడిపించుకుంది శృతి.

మదన్ తల్లిదండ్రులు చిన్నప్పుడే కారు ఏక్సిడెంట్‌లో చనిపోతే ఉన్న ఆస్తిని కాపాడుతూ అతన్ని ఇంజనీరింగ్ చదివించింది బామ్మ. స్టేట్స్‌లో ఎమ్.ఎస్. చేసిన తరువాత అక్కడ ప్లేస్‌మెంట్ ఆఫర్ వచ్చినా పోలేదు. అందుకు కారణం బామ్మ ఒకటైతే మరొకటి మన దేశాన్ని 2020 కల్లా అగ్రరాజ్యాల సరసన చూడాలనే మన దేశ అధ్యక్షులు అబ్దుల్‌కలాం ఆశయాలకి ఊపిరిపోయదలచుకున్న యువకుడిగా'' బిజినెస్ అవుట్‌సోర్సింగ్'' చేస్తున్నాడు మదన్. శృతి కార్పొరేట్ బ్యాంక్‌లో ఆఫీసర్‌గా చేస్తుంది. మదన్‌కి శృతి దూరపు చుట్టం. చిన్నప్పటినించి కొంత ఎటాచ్‌మెంట్ ఉండటం కారణంగా పెళ్ళితో వారి అనుబంధం మరింత దగ్గరై ప్రణయంతో అరే, తురే, యార్ అనే సంబోధనల వరకు వచ్చింది.

''ఈ పిల్లలకి ఇవేం బుద్ధులో మొగుణ్ణి పట్టుకుని అరే, తురే అనటం. ఇప్పటికీ మీ తాతగారిని ఏవండీ అనే పిలుస్తాను, కాని ఇలా మా కాలంలో లేదురా, అయినా గోచారం ప్రకారం మీకు బాగానే వుంది, అయినా మీ మధ్య ఎందుకీ కీచులాటా'' దీర్ఘం తీసింది బామ్మ ఒకనాడు.

''కీచులాట కాదు. మాది కీబోర్డు కిస్‌మిస్ ఆట అర్థం చేసుకోవే'' సర్దిచెప్పాడు మదన్.

సంసారమనే సంగీత స్వరానికి భార్య శృతి అయితే భర్త కేవలం లయ మాత్రమే. శృతిలయలు సమన్వయంగా వున్నప్పుడే ''సుఖసంసారం'' అవుతుంది కాని భార్యభర్తలు చులకన భావంతో ప్రవర్తించకూడదు. చిన్న లెక్చరిచ్చింది బామ్మ. దాన్నే ఫెమిలియార్టీ బ్రీడ్స్ కాంటెస్ట్ అన్నాడు ఇంగ్లీషువాడు. అంటే సాన్నిహిత్యం చులకన భావాన్ని కలిగిస్తుందట.

స్త్రీపురుషులకి గృహస్థాశ్రమం తలమానికమైనది. అందుకు వివాహమనే ప్రక్రియతో ఏడడుగులు (సప్తపది) నడుస్తారు. అన్నము, శరీరబలము, ధనము, సుఖము, సంతానము, ఋతుకాలాభిగమనము, మిత్రత్వము అనే సప్తవిషయాలు సాధనకై దంపతులిద్దరు సాధన చేయాలి కాని ఇలా ఒకరికొకరు కించపరచుకునేలా ఉండకూడదురా అబ్బీ! అని పెద్ద స్పెషల్ క్లాస్ పీకింది వారిద్దరికీ బామ్మ. ''మావి హైటెక్ రోజులు బామ్'' అని తోసిపుచ్చారు మొగుడూపెళ్ళాలు బామ్మ స్పెషల్ క్లాస్‌ని.

''హైటెక్ రోజులైతే మాత్రం పిల్లల్ని నువ్వు కంటావట్రా?'' నిలదీసింది బామ్మ మనవణ్ణి.

''బామ్మా! ప్రస్తుతం మేం అదేపనిలో వుంటాం. నీకో మునిమనవణ్ణి అందించేవరకు మేం సపరేషన్ కేస్ అంటూ బయటపడ్డారు దంపతులిద్దరు.

''ఏయ్ మదన్ నువ్వోసారి ఇలారారా'' బెడ్ రూం నుండి పిలుస్తున్న శృతి పిలుపుతో ఈ లోకంలోకి వచ్చాడు.

''ఎందుకురా అప్పుడే రెడీయా?''

''అప్పుడే అంట.. ఆశ.. నాకో చిన్న పని చేసి పెట్టు''

''మై తేరేలియె కుచ్ భీ కర్ సక్తాహుం'' ఒక్క అంగలో బెడ్‌రూంలో ప్రవేశించాడు.

''ఈ రెండు చీరల్లో ఏది కట్టుకోవాలో చెప్పు, కట్టుకున్నాక తుమ్ కుఛ్ భీ కరో!''

''పసుపు చీరలో రామచిలుక, ఏ కోకలోనైనా సీతాకోక చిలుక, నవ్వుల పువ్వా సిరిసిరి మువ్వా, బ్రహ్మ చేసిన రబ్బరు బొమ్మా, ఏకోక కట్టుకోకపోతే పాలరాతి బొమ్మా'' ఆశువుగా వెక్కిరించాడు మదన్.

''యూ...సిల్లీ...'' అంటూ ఒక చీర అతనిపై విసిరింది.

''ఓ.కె. ఇదే చీర కట్టుకో... ఇదే కదా నేకొన్న కొత్త చీర'' అంటూ తిరిగి ఆమె మీదకు విసరి బూరెల్లాంటి ఆమె బుగ్గల్ని గిల్లి 'సిర్ఫ్ దో కిస్ బస్ జిందగీ'' అమితాబ్ బచ్చన్‌లా ఫోజుపెట్టి రెండువేళ్ళు చూపించాడు మదన్.

''ఇంత హార్డ్‌గా ప్రవర్తించే నువ్వు అసలు సాఫ్ట్‌వేర్ ఎమ్.ఎస్. ఎలా చేశావు మదన్''.

''నీకో సీక్రెట్ తెలుసా అసలు 'సాఫ్ట్‌వేర్' అంతా 'హార్డ్‌వేర్'లోనే వుంది. నాది హార్డ్‌డిస్క్ లవ్. నీలాంటి బ్యూటీ 'మిస్' కి 'కిస్' చేసే మొగుడైనందుకు గర్విస్తున్నాను''. ఆమె ఎరుపెక్కిన బుగ్గల్ని నిమిరాడు.

''అబ్బ వదలరా, ఇక ఇంటర్‌నెట్ ఓపెన్ చెయ్యకు. నీకో గుడ్‌న్యూస్ చెపుతాను'' అంటూ విడిపించుకుని కదిలింది శృతి. ఆ నడకలో రాజహంసహొయలకి, పారాణి ఆరని ఆమె పసిడి


సంసారమనే సంగీత స్వరానికి భార్య శృతి అయితే భర్త కేవలం లయ మాత్రమే. శృతిలయలు సమన్వయంగా వున్నప్పుడే ''సుఖసంసారం'' అవుతుంది కాని భార్యభర్తలు చులకన భావంతోప్రవర్తించకూడదు. చిన్న లెక్చరిచ్చింది బామ్మ. దాన్నే ఫెమిలియార్టీ బ్రీడ్స్ కాంటెస్ట్ అన్నాడు ఇంగ్లీషువాడు. అంటే సాన్నిహిత్యం చులకన భావాన్ని కలిగిస్తుందట.

రంగు పాదాలకున్న పట్టీలు పక్కున నవ్వి లయబద్ధంగా ప్రతిధ్వనించాయి.

శృతిలో ప్రతినిత్యం వరూధినిలాస్యాన్ని చవిచూచే మదన్ ఆనందంగా హమ్ చేసుకుంటూ డివిడిలో యే సిడి ప్లే చేద్దామా అని క్యాసెట్ బాక్స్ ఓపెన్ చేశాడు. అందులో ఒకదానిమీద మురళి అని వుంది. ఇదేమైనా కొత్త సినిమా అనుకుంటూ ప్లే చేశాడు.

మృదంగం వాయిస్తున్న చేతులు, మృదంగంపై భాగాన శృతి పోట్రెట్ నవ్వుల ఫేస్. బ్యాక్‌గ్రౌండులో చిన్నగా మృదంగ నాదంతో స్క్రీన్ మీద డిస్‌ప్లే అయ్యింది.

''శృతిగార్కి నమస్కృతులు: మీరు నాకన్నా పెద్దో చిన్నో తెలియదు. నమస్కారం మన సంస్కారం. అందుకే నమస్కరిస్తున్నాను. అన్యధా తలంచవద్దు. ఎవ్వరైనా లెటర్ వ్రాస్తారు కాని ఇలా 'సిడి'లో వాయిస్ ఎందుకు పంపిస్తున్నానో కారణం మీకు తెలుసు. ఆ రోజు రవీంద్రభారతిలో నా మృదంగ నాదానికి మెచ్చి అభినందిస్తూ కరచాలనం చేసినపుడు నా హృదయ మృదంగంలో కోటి మృదంగాలు ప్రతిధ్వనించాయి. ఆ ప్రతిధ్వని




మిమ్మల్ని వెంటాడి నన్ను ఆరాధనకు గురిచేశాయి. బస్‌స్టాప్‌లో ఎంతమందిలో వున్నా మీ గొంతు ఇట్టే గుర్తుపట్టేయగలను. అది గ్రీష్మఋతువులాంటి నామనసును పులకింపచేసిన వసంత కోకిల కిలా-కిలారవం. ఒక సంధ్యాసమయంలో మనిద్దరం బిర్లామందిర్‌లో సరస్వతీ విగ్రహం ముందు కూర్చుని ఎన్నో కబుర్లు చెప్పుకున్నాము. అప్పుడు సరస్వతియే నా పక్కన కూర్చుని వీణమీటుతూ శృతి పలికిస్తున్నట్లనిపించింది. అది మీ యందు నాకున్న ఆరాధనా భావం. ఒక మంచి మిత్రుడిగా కలకాలం ఉండాలని ఆశిస్తున్నాను. చివరిగా చిన్న కవిత. వత్సరంలో వసంతం తెచ్చేది ఉగాది. మాసంలో వెన్నెల తెచ్చేది పున్నమి. తూర్పున భానుడు తెచ్చేది ఉషోదయం. నా మదిలో 'చెలి నవ్వు' వికసించేది నిత్యం. అదే నాకు ఉగాది, వసంతం, వెన్నెల, ఉషస్సు అంటాను. మీ అభిమాని 'మురళి'. కొంగర జగ్గయ్యలా కంచు కంఠంతో వినిపించే ఆ సిడి విని మదన్‌కి మతిపోయినంత పనైంది. మైక్రోసాఫ్ట్‌లాంటి మా మ్యారేజి లైఫ్‌లో వైరస్‌లా ఈ మురళి ఎవరు? ఎవడైనా ప్రేమలేఖలు రాస్తారు, ఈమెయిల్ పంపిస్తారు, లేఖని సిడిలో పంపించటం లేటెస్ట్ వెర్షనా? ఈ మురళిగాడు పైరసీ సీడీల డీలరా? అయినా శృతి ఇలాంటి వాళ్ళని ఎందుకు ఎంకరేజ్ చేస్తుంది. పెళ్ళికి ముందే ఈ అనుబంధం ఉందా అన్నీ విషయాలు చెప్పిన శృతి ఈ విషయం ఎందుకు చెప్పలేదు? మదన్ మదిలో అనుమానపు శతకోటి శతఘ్నులు పేలాయి.

''మదన్ నీకిష్టం అని స్క్వేర్ నెక్ బ్లౌజ్ కుట్టించుకున్నాను. సారీ బాగుందా? కొంచెం మెడ వెనుక భాగం పౌడర్ అద్దు. ఇది నీ కెంతో ఇష్టమైన పని'' శృతి బెడ్‌రూం నుండి తయారై పౌడర్‌పఫ్‌తో వచ్చి అతని ముందునిల్చుంది. కృష్ణసర్పంలాంటి జడను విసురుగా ముందుకి విసిరింది. ఎప్పుడూ కమ్మని పూల వాసనల అలంకరణతో నడుం వెనుక భాగాన్ని, వెన్నుముఖాన్ని అంటి పెట్టుకున్న జడ గర్వంగా వక్షద్వయం పై వేలాడుతున్న మంగళసూత్రాల్ని తోసి, జారిన పమిటమీదుగా మల్లెమొగ్గ లాంటి నాభిని దర్పంగా తాకి చీరకుచ్చెళ్ళపైకి చిలిపిగా వాలి, ఉదర సౌందర్యాన్ని సొంతం చేసుకుంది. ఎప్పుడూ కటిభాగాన్ని దాటని మంగళ సూత్రం కసిగా అసూయగా చూసింది జడ కుచ్చెల్ని.

మదన్ మౌనాన్ని చూసి 'మౌనమేలనోయి ఈ మరపురాని వేళలో?' చిన్నగా ట్యూన్ చేసింది శృతి.

'శృతీ! ఈ మురళీగాడు ఎవడు? మీ ఇద్దరిమధ్య సీడీ లవ్ ఎఫైర్ ఏంటీ?' కోపంగా నిలదీశాడు అతను.

''మురళీయా! ఓహ్! వెరీనైస్ మ్యాన్. నా అభిమాని''.

''సిగ్గులేకపోతే సరి''.

''నువ్వు ముక్కూమొఖం తెలీని ఐశ్వర్యారాయ్‌కి లెటర్స్ రాసి, ఆమె ఆటోగ్రాఫీని, ఫోటోల్ని, సినీ సిడీల్ని అభిమానించి దాచుకుంటే నేనేమైనా అన్నానా? అంతెందుకు మన పెళ్ళైన రెండోరోజునే 'చిరంజీవి బ్లడ్ డొనేషన్ క్యాంపు'కి వెళ్ళావు నే వద్దన్నానా? మురళీతో స్నేహం నాకు లాస్ట్ ఇయిర్ జరిగింది. రోజూ బస్‌స్టాప్ దగ్గర కనిపించేవాడు. ఒక సారి నా సెల్ పోయింది, అతని ఫ్రెండు ద్వారా నాకు తిరిగి ఇచ్చేసాడు. అప్పటి నుండి రెగ్యులర్‌గా కలుస్తునే ఉన్నాడు. అతనొక మృదంగం ఆర్టిస్టని నాకు తెలీదు. ఒకరోజు అనుకోకుండా రవీంద్రభారతిలో అతని ప్రోగ్రాము చూసి ఆశ్చర్యపోయాను. ఇదంతా నువ్వు స్టేట్స్‌లో ఉన్నప్పుడు జరిగింది. హి ఈజ్ వెరీ నైస్‌మ్యాన్; ఐ లైక్ హిమ్ సో మచ్''

''శృతి...నీ ప్రవర్తన నాకు నచ్చలేదు'' సీరియస్‌గా ఏదో అనాలనుకునే అంతలో బెల్ మ్రోగింది. మదన్ వెళ్ళి తలుపు తీశాడు. ఎదురుగా నల్లకళ్ళ జోడు, చేతిలో తెల్లని కర్రతో పాతికేళ్ళ యువకుడు.

''సార్ శృతి మేడమ్ ఉన్నారా? నా పేరు మురళి'' స్వపరిచయానికి నాంది పలికాడు.

''అంటే...'' మదన్ ప్రశ్నించే అంతలో శృతి వచ్చింది.

''హా ఆర్‌యూ మురళీ? ప్లీజ్ కమ్. నీ గురించే మాట్లాడుకుంటున్నాం. మా ఆయన మదన్'' పరిచయం చేసింది. నిర్ఘాంతపోయాడు మదన్.

''మేడమ్ ఈ రోజు మీ బర్త్‌డే కదా? గ్రీటింగ్స్ చెపుదామని వచ్చాను'' పుష్ప గుచ్ఛాన్ని ఆమె చేతికిచ్చి కరచాలనం చేశాడు. ''సార్! మేడమ్ నా కెంతగానో సహాయం చేశారు. సరైన సమయంలో సహాయం చేసేవాడే మంచి మిత్రులు అంటారు అందుకు ఉదాహరణ మేడమ్. అంధ అనాధనైన నన్ను ఆదరించారు. ఎల్లావేంకటేశ్వర్రావు వంటి ప్రతిభావంతులైన వారి దగ్గర నాకు ట్రైనింగు ఇప్పించారు. అందుకు కావలసిన సహాయం చేశారు. రేపు నేను రష్యా వెళ్తున్నాను. రాష్ట్రపతి రష్యా పర్యటన సందర్భంగా నిర్వహించే 'సాంస్కృతిక కార్యక్రమానికి' మన రాష్ట్ర సాంస్కృతిక శాఖ నన్ను కూడా ఎంపిక చేసింది. అందుకు నా ప్రత్యేక కృతజ్ఞతలు''. చేతులు జోడించి నమస్కరించి బయటకు నడిచాడు మురళి. అవాక్కై నిల్చున్నాడు మదన్.

''ఐయామ్ సారీ శృతి. సుతిమెత్తని నీ హృదయాన్ని సుత్తితో కొట్టాను. అంగవైకల్యం వికారం, మనోవైకల్యం ప్రమాదకరమని తెల్సుకున్నాను'' క్షంతవ్య హృదయంతో దగ్గర చేరాడు మదన్.

''మనిద్దరం కేవలం హైటెక్ దంపతులైనంత మాత్రాన సరిపోదు. మనలో హైటెక్ ఆలోచన లుండాలి. ఓ.కె. నథింగ్ టు వర్రీ!'' అతని ముందు నిశ్చలంగా నిల్చుంది. పరిణతి చెందిన ప్రేమ మూర్తి శృతి.

''ఇందాక ఏదో గుడ్‌న్యూస్ చెపుతానన్నావు. నీకేమైనా ప్రమోషనా'' నిలువుటద్దం ముందు ఆమె బ్యాక్‌నెక్‌పై పౌడరు అద్దుతూ లాలనగా అడిగాడు.

''అవును నీక్కూడా ప్రమోషనే! మనింట్లో 'ల్యాప్‌టాప్' రాబోతుంది''.

''ఎందుకు ఉన్న పి.సి. సరిపోదా?''

''అబ్బ! అదికాదు యార్! నేను 'మదర్‌బోర్డు' అయితే నువ్వు...'' మురిపించింది అతనిచేతే సీక్రెట్ ముడి విప్పే ప్రయత్నంలో.

''ఫాదర్ బోర్డు''

''మనిద్దరం కలిస్తే...''

''యాహూ.. ఓరేకిల్!... శృతి మనిద్దరం ఇప్పుడు కాబోయే 'పే-రెంట్స్' అన్నమాట'' ఆమె గులాబి బుగ్గల్లో జిలేబి తియ్యదనాన్ని చవిచూడాలని వక్రముంబనం చేశాడు.

''శృతి... ఒక్క షరతు...మన ల్యాప్‌టాప్‌గాడ్ని నీ దగ్గర పడుకోబెట్టుకోవద్దు. నీ పెదాలకి కరిచే చీమలు వాడిని కుట్టేస్తాయి'' అతని మాటలకి ఆమె మరింత సుతిమెత్తగా నవ్వింది.

★